క్లుప్తంగా

బైజూస్ యాప్‌పై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ బాలసుందరం

పలమనేరు: బైజూస్, ఇంటరాక్టివ్ ప్యానెల్ యాప్‌లపై స్థానిక మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన శిక్షణ సోమవారంతో ముగిసింది. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. విద్యాబోధనలో భాగంగా ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను ఎలా ఉపయోగించాలి, బైజూస్ ట్యాబ్‌లో ఎర్రర్స్‌ను ఎలా క్లియర్ చేయాలో కోర్సు డైరెక్టర్ బాలసుందరం విపులంగా వివరించారు. ఉపాధ్యాయులతో కృత్యాలను చేయించారు. శిక్షణలో రిసోర్స్ పర్సన్స్ మోహన్ సింగ్, జైకుమార్ వ్యవహరించారు. ఆరు మండలాల హెచ్‌ఎంలు, 230 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి రైతులకు క్యాన్లు పంపిణీ



రైతులతో మాట్లాడుతున్న మునిక్రిష్ణ

బైరెడ్డిపల్లె: మండలంలోని రామనపల్లెలో శ్రీజ పాల డెయిరీ నిర్వాహకులు పాడి రైతులకు 5 లీటర్ల పాల క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ ఏరియా ఆఫీసర్ మునిక్రిష్ణ మాట్లాడుతూ.. పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. మహిళా రైతులు గ్రూపులుగా ఏర్పడితే రుణాలను మంజూరు చేస్తామన్నారు. పశువైద్యాధికారి వెంకట్రమణ పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సావిత్రమ్మ, సునీల్ కుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీపీ ఎల్లప్ప సోమవారం పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎర్రాతివారిపల్లె మార్గంలో నూతనంగా నిర్మించనున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల స్థలంలో అడ్డుగా ఉన్న విద్యుత్‌లైన్ మార్పిడి పనులను పరిశీలించారు. ఆయనతో పాటు ట్రాన్స్‌కో ఈఈ విజయన్, ఏడీఈ నరేంద్ర, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల వితరణ



క్రీడా పరికరాలతో విద్యార్థులు

గంగవరం: పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గంగవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం క్రీడా పరికరాలను అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సుబ్రమణ్యంపిళ్లై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం పరశురాం, ఉపాధ్యాయులు సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, పీపీఎస్ కార్యదర్శి నరసింహులు, శ్రీపురం సీతారామయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమందలో పాలేటమ్మ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ

సోమల: మండలంలోని నెల్లిమందలో పాలేటమ్మ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. కాగా ఈ నెల 16,17వ తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం: ఎంకామ్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని ఐఆర్‌ఎం విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ దయానిధి తెలిపారు. ఎంకామ్ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్‌లో ధరణి 439 మార్కులతో పథమ స్థానం, సాదియా 428 మార్కులు, కవిత 424, ఫైజా 426 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు

ఇదేం రాజకీయం అమరన్న..?

- పలమనేరు భవిష్యత్తుపై అన్నకు అప్పుడెందుకు ప్రేమ లేదో?
- గతంలో మంత్రిగా ఆయన వేసిన శిలాఫలకాలతోనే ఇప్పుడు సెల్ఫీ చాలెంజ్
- ఎలాగూ చేయమని తెలిసే నాడు ఓట్ల కోసం భారీగా శంకుస్థాపనలు
- నాటి పనులను ఈ ప్రభుత్వం చేయలేదంటూ నెపం
- నాటి టీడీపీ పాలనకు నేటి పాలనకు తేడా గమనిస్తున్న జనం



మంత్రిగా తాను వేసిన శిలాఫలకంతో సెల్ఫీ చాలెంజ్ విసురుతున్న మాజీ మంత్రి అమర్





పలమనేరులో వెక్కిరిస్తున్న మాజీ మంత్రి వేసిన శిలాఫలకాలు





జీడిమాకులపల్లి రోడ్డును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేస్తే దాన్ని చూపించి సెల్ఫీ

పలమనేరు: ఎవరైనా మంత్రి పదవి దక్కగానే తన సొంత నియోజకవర్గానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేయడం చూస్తుంటాం. గతంలో పలమనేరు ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి వైఎస్సార్‌సీపీలో గెలిచి టీడీపీలో చేరి రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేశారు. మంత్రిగా ఉన్న కాలంలో అభివృద్ధిని గాలికొదిలి ఎన్నికలు సమీపిస్తుండడంతో అగమేఘాలపై పలు అభివృద్ధి పనులకు ఆర్థికశాఖ ఆమోదం లేకనే శంకుస్థాపనలు చేశారు. ఆపై ఎన్నికల కోడ్‌తో పనులన్నీ కొండెక్కాయి. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే ఇదంతా జరిగిందని నియోజకవర్గ ఓటర్లు భావించే మాజీ మంత్రి అమర్‌పై ఓ రాజకీయ అనుభవం లేని ఓ సాధారణ యువకున్ని 33 వేల మెజారిటీ గెలిపించారు. మంత్రిగా సొంత నియోజకవర్గ భవిష్యత్తును పట్టించుకోక మళ్లీ ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట ఓ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ఇక్కడ ప్రారంభించారు. నాడు మంత్రిగా ఆయన వేసిన శిలాఫలకాలనే చూపుతూ వీటిని ఈ ప్రభుత్వం ఎందుకు చేయలేదంటూ సెల్ఫీ సవాల్ పేరిట జనానికి చెబుతున్నారు. మీరు మంత్రిగా ఉండి చేపట్టలేని పనులపై ఈ ప్రభుత్వాన్ని నిందించడం ఏంటని జనం మాట్లాడుకుంటున్నారు.

అభివృద్ధిని అడ్డుకోలేదా..

గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నా పలమనేరు మున్సిపాలిటీలో మాత్రం వైఎస్సార్‌సీపీ ఘన విజయాన్ని సాధించింది. దీంతో వైఎస్సార్‌సీపీపై కక్ష్య పెట్టుకున్న టీడీపీ ప్రభుత్వం పలమనేరు మున్సిపాలిటీకి రావాల్సిన నిధులు సక్రమంగా రాకుండా అడ్డుకుందనేది పచ్చినిజం. అప్పటి ఐదేళ్ల అభివృద్ధిలో అరణ్యవాసాన్ని చూసిన జనం మున్సిపల్ ఎన్నికల్లో సైకిల్‌కి పంక్చర్ చేశారు. ఇప్పుడు మొత్తం 26 వార్డుల్లో 24 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. అభివృద్ధి కోసమే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లి మంత్రి పదవిని పొందిన ఆయన.. నిజంగా అభివృద్ధి చేసుంటే మొన్నటి ఎన్నికల్లో ఎందుకు చిత్తుగా ఓడారనేది ఇక్కడి ప్రజల మాట.

వెక్కిరిస్తున్న మాజీ మంత్రి శిలాఫలకాలు

మూడేళ్లు మంత్రిగా ఉన్నప్పుడు పలమనేరు పట్టణ అభివృద్ధిని అమరనాథ రెడ్డి అసలు పట్టించుకోకుండా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఎన్నికల కోడ్ కూయకముందే హుటాహుటిన పట్టణంలో పలు శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని దండుమిట్టలో రూ.75 లక్షలతో ఉప ఖజానా కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఆర్ అండ్‌బీ గెస్ట్ సమీపంలో రూ.50 లక్షలతో బీసీ భవన్, మెయిన్‌రోడ్డులో రూ.50లక్షలతో వ్యవసాయశాఖ కొత్త భవనం, పలమనేరులోని గడ్డూరు వద్ద జీప్లస్ త్రీ పక్కా ఇండ్లు, గంటావూరులో కమ్యూనిటీ హాలు, పద్మశ్రీ వద్ద సాంస్కృతిక కళల కోసం ఆడిటోరియం, విశ్వబ్రాహ్మణులు, కాపు భవనాలకు భూమి పూజలు చేశారు. ఆ శిలాఫలకాలన్నీ మాజీ మంత్రిని వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. ఆయన హయాంలో క్యాటిల్‌ఫాం వద్ద మోడల్ మార్కెట్‌కు శంకుస్థాపక చేయగా నేటి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. నాడు టీడీపీ ప్రభుత్వం వదిలేసిన రోడ్లను నేటి వైఎస్సార్‌సీపీలో వేశారు. జీడుమాకులపల్లి రోడ్డును చూపెట్టి సెల్ఫీ చాలెంజ్ విసిరిన మాజీ మంత్రికి ఆ తారురోడ్డును వేసింది ఇప్పటి ప్రభుత్వమేనని తెలియదా అని ఆ గ్రామస్తులు చెప్పుకుంటున్నారు.

ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా

రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రిగా ఉండి నియోజకవర్గంలోని ఓ నిరుద్యోగికైనా ఉద్యోగం కల్పించారా అనేది ఇక్కడి జనం మాట. ఈ ప్రాంతం బెంగళూరు, చెన్నైలకు దగ్గరగా ఉంది. కనీసం వంద మందికి ఉపాధి కలిగేలా ఓ గార్మెంట్ నైనా స్థాపించారా అనే మాటకు సమాధానం చెప్పేవారెవరో. సెజ్ పేరిట ఎన్నో పరిశ్రమలొచ్చాయని చెప్పడం తప్పా స్థానికులకు ఉపాధి ఎంతమందికి దొరికిందనేది ఇప్పటికీ జనం నోట వినిపిస్తున్న మాట. అధికారంలో ఉండీ ఇక్కడి వారికి భవిష్యత్తును కల్పించకుండా మళ్లీ భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తామంటే జనం నమ్ముతారా అనేదే స్థానికంగా చర్చనీయాంశమైంది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

–ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండలంలోని ముద్దనపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలు తీసుకెళ్లారు. ప్రధానంగా మురుగు నీటి కాలువలు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు కావాలని అడిగారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయ న ఆదేశించారు. నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని ప్రజలను కోరారు. అన్ని వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి నవరత్నాల కార్యక్రమం ఎంతో దోహదపడిందన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వృద్ధాప్య పింఛన్లు, విద్యాకానుక, తదితర పథకాలను తీసుకొచ్చి పేదలకు అండగా నిలిచారన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచ్ సికిందర్, ఎంపీటీసీ మంజునాథ్, నాయకులు చంద్రారెడ్డి, గంగాధరం, లోకేష్, అశోక్, కుమార్, ఖాదర్‌భాషా, కేశవరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు

–మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా



కుమ్మరవీధిలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: పట్టణంలో కాలువలు, వీధులు, పైపులైన్ల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని 7, 18, 27, 22 వార్డుల్లోని కుమ్మరవీధి, ఎన్.ఎస్.పేట, రాంనగర్ కాలనీ, జెడ్పీ ఉర్దూ స్కూల్‌వీధి, రాగానిపల్లె రోడ్డులో కాలువలు, సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. సుమారు రూ.2 కోట్లతో పనులు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పట్టణ ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో జీవించేందుకు పుంగమ్మ చెరువు కట్టపై సుమారు రూ.2 కోట్లతో పార్కు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని విస్తర్ణ ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. శాంతినగర్‌లో ప్రమాదాలకు నిలయంగా మారిన విద్యుత్ హెవీ లైన్లను తొలగించి, వేరొక ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు రూ.90 లక్షలు మంత్రి పెద్దిరెడ్డి మంజూరు చేయించారని పేర్కొన్నారు. మిగిలిన సమస్యలను సైతం గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డీఈఈ మహేష్, కౌన్సిలర్ రేష్మా, వైఎస్సార్‌సీపీ నాయకులు సలామత్, కిషోర్, రమణ, అస్లాంమురాధి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

బైరెడ్డిపల్లె: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు బాగుంటేనే ఆ గ్రామం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని బేలుపల్లెలో చేపడుతున్న సిమెంటు రోడ్ల పనులను సోమవారం ఆయన పరిశీలించారు. మండలంలోని వెంగంవారిపల్లె, టీఎస్‌కుప్పం, కుప్పనపల్లె, గుంతకుర్రపల్లె, మిట్టకుర్రపల్లె గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గుంతలు పడిన రహదారుల్లో ప్రయాణించేందుకు ప్రజల ఇబ్బందులను గమనించి రహదార్లు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఆయనతో పాటు సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ భాస్కర్‌మొదలి ఉన్నారు.

•నేటి కార్యక్రమాలు

జగనన్న సురక్ష

సదుం: మండలంలోని బూరగమంద సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఉచితంగా సర్టిఫికెట్లను అందించడంతో పాటు సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారని చెప్పారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సురక్ష క్యాంపులు

శాంతిపురం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాళ్లబూదుగూరు, శివరామపురం గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో ధృవపత్రాలు, సేవల కోసం టోకెన్లు పొందని వారు కూడా నేరుగా వచ్చి ఉదయం 9:30కి ప్రారంభమయ్యే శిబిరంలో ఆయా ధృవపత్రాలు, సేవలను పొందవచ్చని తెలిపారు.

పెద్దారికుంటలో గడప గడపకు..

పెద్దపంజాణి: మండలంలోని పెద్దారికుంట గ్రామ పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వెంకటేగౌడ పెద్దారికుంట, చిన్నారికుంట, గురివిరెడ్డిపల్లి, ఆంజనేయపురం, బసాపురం, పిల్లిగుండ్లపల్లి, చిల్లపల్లి గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొనాలన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

కుప్పం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జానకమ్మ తెలిపారు. ఎంపీపీ అశ్విని అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

వలంటీర్ల నిరసన

సదుం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలపనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలు



మాట్లాడుతున్న అజయ్‌కుమార్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందని జగనన్న విద్యా కానుక కిట్ల పరిశీలకుడు అజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రతి రోజు యూనిఫాం ధరించే పాఠశాలకు రావాలని సూచించారు. అనంతరం నాడు-నేడులో జరుగుతున్న పనులను పరిశీలించారు. హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, రాజేంద్ర, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం



గంగవరం: ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు

గంగవరం: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాల్గో ఆవిర్భావ దినోత్సవాన్ని గంగవరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి, జిల్లా, మండల అధ్యక్షులు రమణ, దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తాలూకా ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, శివప్రసాద్, రాజు, ప్రతాప్‌రెడ్డి, జయకుమార్, గీత, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ కృషి అభినందనీయం



సోమల: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్ చేశారు. ఫెడరేషన్‌లో కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న సచివాలయ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లోకేష్, సచివాలయ కార్యదర్శి దివ్యభారతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తున్న శివకుమార్ (41) అనే వ్యక్తిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఐరాల మండలం ఇరువారంపల్లె క్రాస్ వద్ద ఎస్‌ఈబీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కర్ణాటకలోని నంగిలి నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 25 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని, వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఇతన్ని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, ఆయన ఆదేశాలతో రిమాండుకు తరలించారు. ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



పౌష్టికాహారం అందిస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీ బిడ్డా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో మహతి ఫౌండేషన్ సహకారంతో గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. పాలు, గుడ్లు, తాజా ఆకుకూరలు, పండ్లు, విటమిన్లతో కూడిన పదార్థాలను బాగా తీసుకోవాలన్నారు. రక్తహీనత వలన కలిగే నష్టాలను వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సీహెచ్‌ఓ అనూరాధ, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

గర్భిణులకు వైద్య పరీక్షలు

గంగవరం: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేసుకోవడం సురక్షితమన్నారు. గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన పోషకాహారం వివరాలను తెలియజేశారు. ప్రతి నెలా 9, 10వ తేదీల్లో ఈ కార్యక్రమం ఉంటుందని.. క్రమం తప్పకుండా పీహెచ్‌సీలో జరిగే వైద్య పరీక్షలకు హాజరుకావాలన్నారు.

సురక్షతో సత్వర సేవలు



ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

పుంగనూరు: జగనన్న సురక్షతో సత్వర సేవలు పొందవచ్చని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని నానబాలవీధి సచివాలయంలో సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ.. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మిగిలిపోయిన సమస్యలను కూడా సురక్ష కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి గుర్తించి పరిష్కరిస్తామన్నారు. కౌన్సిలర్ జేపీ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంతియాజ్‌ఖాన్, రమణ, వరదారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా జంగమ గురుదేవర



జంగమ గురువుదేవరలో పాల్గొన్న భక్తులు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని బోడిరెడ్డిపల్లి, గడ్డూరులో జంగమ కులస్తుల వీరభద్రస్వామి గురువుదేవరను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మర్రిచెట్టు వద్దకు మంగళవాయిద్యాలు, చెక్కభజనలతో ఊరేగింపుగా వెళ్లారు. ఈ సందర్భంగా వీరభద్రుని ఖడ్గాలను ఎత్తుకుని గురువులు ముందుకు సాగారు. అక్కడ ఏర్పాటు చేసిన మట్టి విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి, గురువులు దండకాలను ఆలపించారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులు స్వామివారికి పూజాద్రవ్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వీరభద్రుని హోమం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, మురళీకృష్ణ దంపతులు, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు చెంగారెడ్డి, ప్రహ్లాద, మండీ సుధా, రవి పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి తప్పదు మూల్యం



హైవేలో రేడియం స్టిక్కర్ లేకుండా వెళుతున్న ట్రాక్టర్

- రాత్రిపూట ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాలీ ట్రాక్టర్లు
- రేడియం స్టిక్కర్లు లేకనే హైవేలో వెళుతున్న వైనం
- వెనుక వచ్చే వాహనాలకు ట్రాక్టర్లు కనిపించక ప్రమాదాలు

పలమనేరు: పట్టణానికి సమీపంలోని చెన్నై-బెంగళూరు, అనంతపూర్-కృష్ణగిరి హైవేలో రాత్రి వేళల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ట్రాక్టర్ల ట్రాలీలకు రేడియం స్టిక్కర్లు లేని కారణంగా వెనుక నుంచి వచ్చే వాహనాలు వేగంగా ఢీకొంటున్నాయి. గత నెలలో ట్రాక్టర్ల కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, నలుగురు ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. ప్రస్తుతం జిల్లాలో మామిడి సీజన్ కొనసాగుతోంది. రైతులు మామిడిని ట్రాక్టర్లలో బంగారుపాళెం, పూతలపట్టు, వేలూరు, కాణిపాకం, మదనపల్లె, హోస్‌కోటకు తరలిస్తున్నారు. ఈ ట్రాక్టర్ల ట్రాలీకి వెనుకవైపు రెడ్‌లైట్లు, రేడియం స్టిక్కర్లు ఉండడంత లేదు. వెనుక వచ్చే వాహనాలకు దగ్గరికి వచ్చేంత వరకు ట్రాక్టర్ కనిపించక పోతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 2022లో 711 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. మొత్తం 366మంది మృతి చెందారు. 799మంది గాయపడ్డారు.

అవగాహన కల్పించాం



రవాణా, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో హైవేపై వెళ్లే ట్రాక్టర్ల డ్రైవర్లకు అవగాహన కల్పించాం. రేడియం స్టిక్కర్లను స్వయంగా అంటించాం. కాని కొందరు ట్రాక్టర్ యజమానులు రేడియం స్టిక్కర్లు అంటించడంపై నిర్లక్ష్యం చూపుతున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ కాబట్టి హైవేలో వెళ్లే ట్రాక్టర్ ట్రాలీలకు కచ్చితంగా రేడియం స్టిక్కర్ ఉండాల్సిందే. లేని వాహనాలను సీజ్ చేస్తాం. **- మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు**